**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**జాతీయ వార్తలు**

**తేదీ.14.11.2024** **సమయం. 19.05 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. ఈ రోజు 'జంజాతీయ గౌరవ్ దివస్' సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ రాత్రి 8 గంటలకు దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.
2. దేశంలో రైతులను ఎవరూ విభజించలేరని, జాతీయత కోసం రైతు వర్గ ఐక్యత ఎంతో అవసరమని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ అన్నారు.
3. వికసిత్ భారత్' వైపు వెళ్తున్న దేశం మార్గంలో మహారాష్ట్ర తప్పనిసరిగా ముందంజలో ఉండాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కోరారు.
4. దేశంలో గేమింగ్ రంగ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖ ప్రత్యేక కార్యదర్శి నీర్జా శేఖర్ చెప్పారు.

**PREZ- JANJATIYA GAURAV DIVAS**

ఈ రోజు 'జంజాతీయ గౌరవ్ దివస్' సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ రాత్రి 8 గంటలకు దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఆకాశవాణి, ఢిల్లీ, ఇంద్రప్రస్థ, ఆకాశవాణి లైవ్ న్యూస్ 24x7, FM గోల్డ్, FM రెయిన్‌బో ఛానళ్ల ద్వారా రాష్ట్రపతి ప్రసంగం ప్రత్యక్ష ప్రసారమవుతుంది.

భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని రేపు జనజాతీయ గౌరవ్ దివస్‌ను నిర్వహించనున్నారు. దేశ చరిత్ర, సంస్కృతికి గిరిజన సంఘాలు చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకుంటారు. రాష్ట్రపతి సందేశాన్ని అన్ని ప్రాథమిక ఛానెల్‌లు, స్థానిక రేడియో స్టేషన్‌లు, ఆకాశవాణి FM గోల్డ్, FM రెయిన్‌బో నెట్‌వర్క్ రేపు ఉదయం 8:45, సాయంత్రం 5:30 గంటలకు పునఃప్రసారం చేస్తాయి. రేపు బీహార్‌లోని జాముయిలో గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న 'జంజాతీయ గౌరవ్ దివస్' కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరుకానున్నారు. ఆకాశవాణి, ఢిల్లీ ఈ కార్యక్రమాన్ని 11.30 AM నుండి FM గోల్డ్, ఇంద్రప్రస్థ, ఆకాశవాణి లైవ్ న్యూస్ 24x7 ఛానెల్‌లలో ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.

## VP-PUSHKAR VISIT

ఈ దేశంలో రైతులను ఎవరూ విభజించలేరని, జాతీయత కోసం రైతు వర్గ ఐక్యత ఎంతో అవసరమని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ అన్నారు. ఈరోజు అజ్మీర్ సమీపంలోని పుష్కర్‌లో జరిగిన 105వ జాతీయ జాట్ సమాజ మహాసభలో ధన్కడ్ ప్రసంగించారు. యువ తరంలో నైతిక విలువలు పెంపొందించి వారికి సరైన మార్గాన్ని చూపాలని ఉప రాష్ట్రపతి రైతులకు సూచించారు. దీంతో పాటు, కుటుంబం, పర్యావరణం, విధులను నిర్వర్తించాలని ఉద్ఘాటించారు. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, వ్యాపారంలో తమ భాగస్వామ్యాన్ని పెంచాలని జగదీప్ ధన్కడ్ రైతులను కోరారు. తన పర్యటన సందర్భంగా, ఉప రాష్ట్రపతి బ్రహ్మ దేవాలయం, జాట్ శివాలయాన్ని కూడా సందర్శించారు.

## REV. MAHARASHTRA - VIKSIT BHARAT

వికసిత్ భారత్' వైపు వెళ్తున్న దేశం మార్గంలో మహారాష్ట్ర తప్పనిసరిగా ముందంజలో ఉండాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కోరారు. ఈ దృష్టిలో భాగంగానే, రాష్ట్రంలో ప్రస్తుతం అనేక

ఆధునిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని అన్నారు. మరాఠ్వాడాలోని ఛత్రపతి సంభాజీనగర్ జిల్లాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రసంగిస్తూ, ఈ ప్రాంతం కోసం పెట్టుబడి ఒప్పందాలు 70 వేల కోట్ల రూపాయల మేరకు కుదిరాయన్నారు. మరఠ్వాడాలో 45 వేల కోట్ల రూపాయల వ్యయం గల ప్రాజెక్టులు అమలవుతున్నాయని అన్నారు. డిండోరిలో జరిగిన ర్యాలీలో ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ నేత అజిత్ పవార్ ప్రసంగించారు. మరోవైపు ఇగత్‌పురిలో జరిగిన ర్యాలీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రసంగించారు. మాజీ ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మార్గదర్శకత్వం వహించిన వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. శాసనసభ ఎన్నికలలో తమ అభ్యర్థుల గెలుపు కోసం ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ పూణె జిల్లాలో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. అహల్యానగర్ జిల్లాలోని శ్రీగొండలో జరిగిన ర్యాలీలో శివసేన (యుబిటి) అధినేత ఉద్దవ్ ఠాక్రే ప్రసంగించారు.

## MIZORAM - DoNER MINISTER

గత దశాబ్దంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈశాన్య ప్రాంతం గణనీయమైన అభివృద్ధిని సాధించిందని, కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ సహాయ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా చెప్పారు. ఈరోజు మిజోరాం రాజధాని ఐజ్వాల్‌లో మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ... ఈశాన్య ప్రాంతాన్ని భారత ఆర్థిక వ్యవస్థ గ్రోత్ ఇంజిన్‌గా మార్చడమే **NDA** ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. భారత ఉపఖండంలోకి ఆగ్నేయాసియా దేశాలన్నింటికి ఈశాన్య ప్రాంతం ప్రవేశ ద్వారం వంటిదని, భారతదేశ అభివృద్ధిలో ఈశాన్య ప్రాంతాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈనాడు ఈశాన్య ప్రాంతంలో 17 విమానాశ్రయాలు ఉన్నాయని, రానున్న కాలంలో ఈ ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలు రైల్వేతో అనుసంధానం కానున్నాయని చెప్పారు. పర్యాటకం, వన్యప్రాణులు, క్రీడలు, వెదురు, ఉద్యానవనం, వ్యవసాయం, జలవిద్యుత్, టెలికాం, అనేక ఇతర రంగాలలో మిజోరం అద్భుతమైన వృద్ధికి అవకాశం ఉందని

మంత్రి చెప్పారు. ఈశాన్య ప్రాంత అభివృద్ధి పథకాల కింద రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులను సమీక్షించేందుకు సింధియా ఒకరోజు పర్యటన కోసం ఐజ్వాల్‌కు వెళ్లారు.

**IITF:**

43వ భారత అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన (IITF) న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ప్రారంభమైంది. 14 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రారంభించారు. వికసిత్ భారత్ 2047 ఈ ప్రదర్శన ఇతివృత్తంగా ఎంచుకున్నారు. ఈ ప్రదర్శనలో ఈ సంవత్సరం జార్ఖండ్ రాష్ట్రంపై దృష్టి పెట్టగా, బీహార్, ఉత్తరప్రదేశ్ భాగస్వామ్య రాష్ట్రాలుగా ఉంటాయి. ఆ ప్రదర్శనలో మొదటి ఐదు రోజులు అంటే ఈనెల 18 వరకు వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు జరుగుతాయి. కనీసం రెండు సంవత్సరాలకు ఒకసారి వాణిజ్య ప్రదర్శన నిర్వహించాల్సిన అవసరం ఉందని పీయూష్ గోయల్ నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా ఐఐటీఎఫ్ 2024లో కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ పెవిలియన్‌ను ఆ శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రారంభించారు.

**KARMAYOGI:**

నేషనల్ లెర్నింగ్ వీక్ కర్మయోగి సప్తాహ్ మంచి ఫలితాలు ఇచ్చిందని, ఇది దేశ వ్యాప్తంగా ఉన్న కర్మయోగులను ఏకతాటి పైకి తీసుకొచ్చిందని కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. కొత్త ఢిల్లీలో ఈరోజు జరిగిన కర్మయోగి సప్తాహోత్సవ వేడుకలో డాక్టర్ జితేందర్ సింగ్ ప్రసంగించారు. జాతీయ అభ్యాస వారోత్సవాల ఆలోచన ప్రధానమంత్రి నరేంద్రమోదీ నుండి వచ్చిందని అన్నారు. నేర్చుకునే ప్రక్రియను కొనసాగించాలని అన్నారు. కెపాసిటీ బిల్డింగ్ కమీషన్ ఛైర్మన్ ఆదిల్ జైనూల్ భాయ్ మాట్లాడుతూ... iGOT ప్లాట్‌ఫారమ్‌లో వెబ్‌నార్లు, వర్క్ షాప్‌లు, యోగ్యత-అనుసంధాన అభ్యాసం ద్వారా, శ్రామిక శక్తి జీవితకాల అభ్యాసానికి మార్గం సులభమైందని అన్నారు.

గేమింగ్-నిరజా శేఖర్:

దేశంలో గేమింగ్ రంగ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నట్లు కేంద్ర సమాచార ప్రసార శాఖ ప్రత్యేక కార్యదర్శి నీర్జా శేఖర్ చెప్పారు. హైదరాబాద్ లో జరుగుతున్న ఇండియా గేమ్ డెవలప్మెంట్ కాన్ఫరెన్స్ లో నిర్జా శేఖర్ పాల్గొన్నారు. గెమింగ్, వినోద్ రంగాలకు సంబంధించి పలు అంశాలపై జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణా రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తోనూ సమావేశం అయ్యారు. రాష్ట్రంలో గేమింగ్ జోన్ల విస్తరణపై విస్తృతంగా చర్చించారు. అనంతరం నీర్జా శేఖర్ విలేకారులతో మాట్లాడుతూ, గేమింగ్ జోన్ల వల్ల ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుందన్నారు. దేశంలోని పెద్ద సంస్థలతో సహా అంతర్జాతీయ సంస్థలు కూడా ఇక్కడ గేమింగ్ జోన్ లను ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల వల్ల, రానున్న రోజుల్లో భారత్ అత్యుత్తమ గేమింగ్ జోన్ గా ఆవిర్భవిస్తుందని నీర్జా శేఖర్ పేర్కొన్నారు.

**IMRAN KHAN- PAKISTAN**

పాకిస్తాన్ తోషాఖానా-**II** కేసులో తమను నిర్దోషులుగా విడుదల చేయాలంటూ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్య బుష్రా బీబీ చేసిన అభ్యర్థనలను ఆ దేశ కోర్టు ఈరోజు తిరస్కరించింది. సెంట్రల్ ఇస్లామాబాద్‌లోని ప్రత్యేక న్యాయస్థానంలో విచారణ సందర్భంగా న్యాయమూర్తి, ఈ అభ్యర్థనలను తిరస్కరిస్తూ, వచ్చే సోమవారం వారిపై అధికారికంగా అభియోగాలు నమోదు చేయనున్నట్లు ప్రకటించారు. ఇమ్రాన్, అతని భార్య అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ప్రభుత్వ కానుకలను తమ వద్ద ఉంచుకొని విక్రయించారని ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలను పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పిటిఐ) పార్టీ కొట్టి వేస్తూ... తాము ఎటువంటి తప్పు చేయలేదని పేర్కొంది. **2022**లో అవిశ్వాస తీర్మానం ద్వారా ఇమ్రాన్ ప్రభుత్వం తొలగించినప్పటి నుండి ఖాన్ డజన్ల కొద్దీ కేసుల్లో చిక్కుకున్నారు. ఒక సంవత్సరం పాటు కస్టడీలో ఉన్నారు.

**WPI - OCTOBER DATA**

**భారతదేశం టోకు ధరల సూచిక (WPI) ఆధారిత ద్రవ్యోల్బణం అక్టోబర్ నెలలో వార్షిక ప్రాతిపదికన 2.36 శాతానికి పెరిగింది. సెప్టెంబరులో డబ్ల్యుపిఐ ద్రవ్యోల్బణం 1.84 శాతం, ఆగస్టు ద్రవ్యోల్బణం 1.25 శాతంగా ఉందని ఈరోజు వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన సమాచారంలో తెలిపారు. అక్టోబర్‌లో ద్రవ్యోల్బణం పెరగడానికి ప్రధానంగా ఆహార వస్తువులు, ఆహార ఉత్పత్తుల తయారీ, ఇతర తయారీ రంగాలు, మోటారు వాహనాల ఉత్పత్తిలో అధిక ధరలు కారణమని ఆ నివేదికలో పేర్కొన్నారు.**